ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 సంచిక : 10 జూన్ 2022

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2


శ్రీమద్భగవద్గీత ........................................................ 21

అక్షరమణమాల ........................................................ 24

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



మీ సుఖం కోసం, శాంతి కోసం మనుషుల మీద కానీ ప్రపంచం మీద కానీ ప్రకృతి మీద కానీ బాహ్య సంఘటనల మీద కానీ ఆధారపడకుండా మీరు స్వతంత్రంగా సుఖం అనుభవిస్తూ ఉంటే ఇంక మీకు పునర్జన్మలు లేవు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 20 జనవరి 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మార్టేరు నుంచి కొంతమంది భక్తులు శ్రద్ధగా వస్తున్నారు. ఈరోజు ఇక్కడకి రాగానే ఒక ప్రశ్న అడిగారు. నేను ఇక్కడ మీకు చెప్పే మాటలు మీకు అర్థం అవ్వకపోతే ఈ సమావేశం అయిన తరువాత మీరు అడగండి. నేను ఒకటి చెబితే మీరు ఇంకొకటి అర్థం చేసుకోకండి. మీకు properగా అర్థం అయితే సరే సరి. Properగా అర్థం కాకపోతే మళ్ళీ తిరిగి నన్ను అడుగుతూ ఉండండి. సమావేశం అయిన వెంటనే జ్ఞాపకం ఉంచుకుని అడగండి. మార్టేరు వారు అడిగిన ప్రశ్న ఏమిటి అంటే, శరీరం పుట్టినపుడు అహంకారం పుడుతుంది అని చెప్పారు, శరీరం మరణించిన తరువాత అహంకారం మరణిస్తుంది అని మీరు చెప్పారు అంటున్నారు. నేను అలా ఎప్పుడూ చెప్పలేదు. వాళ్ళు అర్థం చేసుకోవడంలో పొరపాటు. అది మనసులో ఉంచుకుని అడిగేశారు. అది మంచిదే. వాళ్ళు పొరపాటుగా అర్థం చేసుకుని ఇంకొకళ్ళకి carry చేస్తే వాళ్ళు ఇంకొక రకంగా అనుకుంటారు కదా, అందుచేత మనం తినే ఆహారం విషయంలోనూ, చదువు విషయంలోనూ ఎప్పుడూ మనం మొహమాటం పడకూడదు. మనం తిండి విషయంలో మొహమాటం పడుతున్నాం అనుకోండి, చదువు విషయంలో మొహమాటం పడుతున్నాం అనుకోండి నష్టపోయేది మనమే. ఎవరైతే మొహమాట పడుతున్నారో వాళ్ళు నష్టపోతారు. వ్యవహారంలో మొహమాట పడేవారు కూడా నష్టపోతారు. పరమార్థికం అనే కాదు, పరమార్థికం సరే సరి. వ్యవహారంలో మొహమాట పడినా నష్టపోతారు. చదువు విషయంలో, భోజనం విషయంలో, వ్యవహారం విషయంలో, మొహమాట పడటం మంచిది కాదు.

"గురువును సంతోష పెట్టి, గురువుకి సేవ చేసి, గురువుని ప్రసన్నం చేసుకుని, ఏ టైములో అడగాలో, ఎప్పుడు మాట్లాడాలో, ఎప్పుడు మాట్లాడకూడదో, ఆ సమయం, సందర్భం చూసుకుని గురువుని అడిగి తెలుసుకుని సంశయాలు తీర్చుకోండి" అని భగవద్గీతలో భగవంతుడు వాసుదేవస్వామి చెప్పాడు. విషయం మీకు అర్థం అయితే సరే సరి, అర్థం కాకపోతే వెంటనే అడగండి. శరీరం పుట్టినప్పుడు అహంకారం పుట్టడం, శరీరం మరణించినపుడు అహంకారం మరణించడం కాదు. ఇక్కడ చిన్న విషయం ఉంది. మీరు ఈ సింపుల్ విషయం బాగా అర్థం చేసుకోవాలి. శరీరం పుట్టినప్పుడు మనం పుట్టాం

అనుకుంటున్నాం, అది అబద్ధం. అహంకారం పుట్టినప్పుడు పుట్టాం. మీకు ఇప్పుడు ఎంత వయసు? యాభై సంవత్సరాలు. మరి యాభై సంవత్సరాలలోనూ మీకు అనేక జ్ఞాపకాలు వస్తున్నాయి. అనేక అనుభవాలు ఉన్నాయి. అనేక కోరికలు ఉన్నాయి. అనేక వాసనలు ఉన్నాయి. అనేక తలంపులు ఉన్నాయి. అనేక ఊహాలు ఉన్నాయి. ఈ జీవితానికి, ఈ శరీరానికి సంబంధించినవే కాకుండా అనేకం వస్తున్నాయి. ఇవన్నీ ఎక్కడ నుంచి వస్తున్నాయి? జన్మాంతరముగా మీరు అనుభవించినవే ఇలా వాసనల రూపంలో వస్తున్నాయి. మనం అందరం చేసే పొరపాటు ఏమిటి అంటే శరీరం జన్మించినప్పుడు జన్మించాం అనుకుంటాం, శరీరం మరణించినప్పుడు మరణించాం అనుకుంటున్నాం. ఇప్పుడు మన శరీరం పోయినప్పుడు ఏమనుకుంటున్నాం అంటే మరణించాం అనుకుంటున్నాం. అది అబద్ధం! అంటే మనం శరీరం ఉన్నంత కాలం బట్టలు ఎలా వేసుకుంటామో, అలాగే అహంకారం ఉన్నంత కాలం శరీరాలు వేసుకుంటాం. శరీరం ఉన్నంతసేపుఏదో ఒక బట్ట వేసుకుంటాం, మంచి బట్టో, పాత బట్టో, ఏదో ఒక బట్ట వేసుకుంటాం శరీరం ఉన్నంతసేపు. శరీరం ఉన్నంతసేపు బట్టలు ఎలా వేసుకుంటున్నామో, అలా అహంకారం ఉన్నంతసేపు శరీరం అనే గుడ్డను వేసుకుంటున్నాం. శరీరం పోయిన వాడికి బట్ట తోటి పని ఏముంది? అదే విధంగా అహంకారం పోయినవాడికి శరీరం తోటి పనిలేదు.

ప్రశ్న అడిగిన మార్టేరు వారు బాగా అర్థం చేసుకోవాల్సింది ఏమిటి అంటే అహంకారం పుట్టినప్పుడు నువ్వు పుట్టావు. కానీ నువ్వు అనుకునేది శరీరం పుట్టినప్పుడు పుట్టాను అనుకుంటున్నావు అది తప్పు. అహంకారం మరణించినప్పుడు నువ్వు మరణిస్తావు శరీరం మరణించినప్పుడు నువ్వు మరణించవు. అంటే మీకు విషయాన్ని detailedగా చెప్పటం కోసం ఇది ప్రస్తావించాను. అసలు నాకు అహంకారం ఉన్నంతకాలం నాకు మీరు వేరుగా కనిపిస్తారు. ప్రపంచం వేరుగా కనిపిస్తుంది. దేవుడు వేరుగా కనిపిస్తాడు. మీరు అనుభవించే సుఖం, మీరు అనుభవించే కష్టం, మీరు అనుభవించే దుఃఖం ఇవన్నీ వేరుగా కనిపిస్తాయి. వేరుపాటు ఎవరికి? అహంకారానికి! అంటే అహంకారం ఉందా లేదా మనకి? మనలో ఉండి దుఃఖ పడేది అహంకారం, ఆవేశ పడేది అహంకారం, ఏడ్చేది అహంకారం, పొంగేది అహంకారం, హెచ్చుతగ్గులు తీసుకొని వచ్చేది అహంకారం. నేను దేని తోటి కలిసి ఉన్నాను? నా శరీరం తోటి నేను కలిసి ఉన్నాను. నా పేరు తోటి కలిసి ఉన్నాను. ముందు శరీరం వస్తుంది. ఆ శరీరానికి ఒక పేరు పెట్టారు. ఎల్లమ్మో, పుల్లమ్మో, సుబ్బమ్మో, లేకపోతే వెంకట రామ రాజో, సుబ్బరాజో, రామరాజో, ఏదో ఒక పేరు పెట్టారు. శవం వచ్చింది ఈ శవానికి ఒక పేరు

పెట్టారు. నేను ఏమి చేస్తున్నాను? ఆ శవం తోటి, ఆ పేరు తోటి కలిసి బ్రతుకుతున్నాను. ఇది అహంకారం. మనం శరీరం తోటి, మన పేరు తోటి కలిసి బ్రతుకుతున్నామా? లేదా? కలిసి బ్రతుకుతున్నాం కాబట్టి మనకి దుఃఖం వస్తుంది లేకపోతే దుఃఖానికి లోకంలో ఆస్కారం లేదు. ఒక శరీరం తోటి మీరు కలిసి ఉన్నారు. అంతేకాదు ఆ శరీరానికి పెట్టిన పేరు తోటి కూడా కలిసి ఉన్నారు. మీ పేరు వేస్తాం అంటే ఒక లక్ష రూపాయలు ఇచ్చేస్తారు. ఆ పేరు ఎవరిది? మీదా? అంటే ఆ పేరు తోటి కలిసి ఉన్నారు అన్నమాట మీరు. ఇది అహంకారం. మీరు ఒక శరీరం తోటి కలిసి ఉన్నారు, ఆ శరీరానికి పెట్టిన పేరు తోటి కలిసి ఉన్నారు. అలా ఎన్ని జన్మలు అయితే శరీరం తోటి, పేరు తోటి కలిసి ఉంటామో, అంతకాలం ఆ జన్మకాజన్మ, అహంకారంతో పాటు అజ్ఞానం కూడా పెరుగుతూ ఉంటుంది.

మీరు ముక్కు చివర పెట్టండి, లేకపోతే భ్రూమధ్య మీద దృష్టి పెట్టండి, ఇటువంటివి మీరు చేస్తే చెయ్యండి. నేను చెప్పేది అది కాదు. Subject అర్థం చేసుకోండి, ముక్కు చివర పెట్టండి, గాలి పీల్చుకోండి, గాలి విడిచి పెట్టండి. ఇటువంటి temporary గొడవలు వద్దు మనకి, temporary ఉద్యోగాలు మనకి ఎప్పుడు ఊడిపోతాయో తెలియదు. మనం వెళ్ళేది permanent jobకి వెళ్ళాలి కానీ temporary ఉద్యోగాలకి కాదు. Temporary ఉద్యోగాలు అంటే ఏమో పొద్దున్నచేరితే సాయంత్రానికి వెళ్ళిపోమనచ్చు ఇంటికి. ఈ ముక్కు చివర పెట్టడం అటువంటిది. విషయం మీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నంచెయ్యండి. మీకు విషయం అర్థం కాకపోతే ముక్కు చివర పెట్టినా లాభం లేదు. మనకి తలంపు వచ్చింది అంటే ఆ తలంపు మన అహంకారం అభివృద్ధి చేసుకోవడానికి వస్తుంది. ముక్కు చివర పెట్టి మీరు సాధించేది ఏమిటి? మీకు తలంపు వస్తుంది. తలంపు వచ్చేటప్పుడు ఎలా వస్తుంది మీకు? అహంకారం చుట్టూ తిరుగుతుంది మీ తలంపు, మీరు ఇంటికి వెళ్ళిన తరువాత ప్రశాంతంగా

**మనిషికి కామక్రోధాలని జయించటం కంటే కీర్తికాంక్ష జయించటం కష్టం అని మిల్టన్ చెప్పాడు. ముసలితనం వచ్చాక కామక్రోధాల వేగం తగ్గిపోతుంది. వంద ఏళ్ళు వచ్చి, మంచం పట్టి రేపు చనిపోయేవాడికి కూడా కీర్తికాంక్ష పోదు. కీర్తికాంక్షని పోగొట్టుకోవటం చాలా కష్టం అని మిల్టన్ చెప్పాడు.**



చూసుకోండి నేను చెప్పిన మాట అవునో, కాదో! కాదు అనుకోండి నేను చెప్పిన మాటలు మీరు ఏది నమ్మద్దు. దూడలని బేరం ఆడేవాడు దూడలని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడో, బట్టలు కొనుక్కునే వాడు బట్టలని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడో, మీరు ఏదైనా వస్తువు కొనుక్కుంటే బంగారం అదిమంచిదో, కాదో ఎంత జాగ్రత్తగా చూసుకుంటారో, అంత జాగ్రత్తగా ప్రతీ మాట పరిశీలించుకోండి.

మీకు తలంపు వస్తుంది, ఇంటి దగ్గర మీరు జాగ్రత్తగా ఆలోచించండి. మీ తలంపు ఎవరి చుట్టూరు తిరుగుతుంది? ఎవరి కోసం వస్తుంది తలంపు? మీ అహంకారం అభివృద్ధి చేసుకోవడం కోసం, మీ అహంకారం చుట్టూ ఆ తలంపు తిరుగుతూ ఉంటుంది. ఒక పక్క మీకు తలంపు వచ్చి అహంకారం పెంచుతుంటే ముక్కు చివర పెట్టి ఎంతకాలం ఉంటారు? నేను చెయ్యద్దు అని చెప్పటం లేదు. అది standard కాదు, అది సరైన solution కాదు. మనం చేసే పనులు మన అహంకారం కోసం చేస్తున్నాం. మనకి వచ్చే ఆలోచనలు మన అహంకారం కోసం వస్తున్నాయి. మనకి వచ్చే ఊహాలు అహంకారం కోసం వస్తున్నాయి. మనం ఎవరితోటి మాట్లాడినా, ఎవరితోటి స్నేహం చేసినా, ఎవరితోటి విరోధంగా ఉన్నా అహంకారం కోసమే స్నేహం చేస్తున్నాం, అహంకారం కోసమే విరోధం చేస్తున్నాం. మనకు కేంద్రం ఏది? అహంకారం. మన కేంద్రం ఆత్మ కాదు, మన కేంద్రం దేవుడు కాదు, మన కేంద్రం దెయ్యం. మనం దెయ్యం చుట్టూరు తిరుగుతున్నాం, కానీ దేవుడు చుట్టూరు తిరుగుతున్నాం అనుకుంటున్నాం. తిరిగేది ఏమో దెయ్యం చుట్టూరు, అనుకునేది ఏమో దేవుడు చుట్టూరు తిరుగుతున్నాం అని అనుకుంటున్నాం. అనుకునేది వేరు, జరిగేది వేరు. మన చేష్టలు, మన ఊహాలు, మన కర్మ, మన భక్తి కూడా మన అహంకారం అనే దెయ్యం చుట్టూ తిరుగుతున్నాయి. కానీ ఆశిస్తున్నాం, దేవుడిని ఆశిస్తున్నాం. ప్రతీ మనిషి పాపం చేస్తాడు కానీ పుణ్యం వలన వచ్చే ఫలితాన్ని ఆశిస్తాడు. చేసేది చెడ్డ పని, ఫలితం మటుకు మంచి చేసేవాడికి ఏ ఫలితం వస్తుందో ఆ ఫలితం ఆశిస్తాడు చెడ్డవాడు కూడా.

ఈ అహంకారానికి హెచ్చు తగ్గులు ఎలా వస్తున్నాయి? ఈ అహంకారం ఎలా పెరుగుతోంది? ఈ అహంకారం అనే సమస్యను పరిష్కారం చెయ్యకుండా మీరు ఎన్ని పుణ్యాలు సంపాదించినప్పటికీ మీకు జ్ఞానం రాదు. దానాలు చేయండి, వ్రతాలు చెయ్యండి, జపాలు చెయ్యండి, పుణ్యాలు సంపాదించండి. ఆ పుణ్యం ఖర్చు అయ్యిపోతుంది. కల ఎలా కరిగిపోతుందో అలాగ పుణ్య ఫలితం వస్తుంది, ఖర్చు అయ్యిపోతుంది. ఇలా ఎన్ని జన్మలు

ఎత్తినప్పటికీ మీ అహంకారం, మీరే మిగులుతారు. పుణ్యం అంతా ఖర్చు అయిపోతుంది. పెద్ద పెద్ద రాశులైన తరిగిపోతాయి తింటూ ఉంటే! అలాగే అహంకారం పెట్టుకుని ఎంత పుణ్యం చేసుకున్నప్పటికీ ఆ పుణ్యం అనుభవంలోకి వచ్చి ఏదో ఒక జన్మలోనో, రెండు జన్మలలోనో, మూడు జన్మలలోనో కరిగిపోతుంది. ఈ అహంకారం అనే సమస్యను, మిమ్మల్ని పీడిస్తున్న ఈ సమస్యని, మిమ్మల్ని జన్మ జన్మల నుంచి తిప్పి, తిప్పి మిమ్మల్ని ముప్పు తిప్పలు పెడుతున్న ఈ సమస్యని పరిష్కరించుకోవాలి. శరీరం రావడానికి అహంకారం కారణం. అహంకారం లేకపోతే శరీరంతోటి అసలు పనే ఉండదు. ఈ శరీరం ఎవరిది? ఈ శరీరం ఎవరికి కావాలి? నాలో ఉన్న అహంకారానికి శరీరం కావాలి. దానికి శరీరం కావాలి అని శరీరం తొడుగుతుంది. నా అహంకారానికి శరీరం కావాలి కాని నాలో ఉన్న ఆత్మకి శరీరం అక్కర్లేదు. చిన్న ముక్క మీరు అర్థం చేసుకోండి చాలు, పెద్ద పెద్ద మాటల తోటి పనిలేదు.

మీరు ఎన్ని గ్రంథాలు చదివినా, భారతం, భాగవతం, రామాయణం ఎన్ని గ్రంధాలు చదివినా ఈ అహంకారం రూపంలో ఉన్న సమస్యని పరిష్కారం చేసుకోలేనప్పుడు, కల్మషం రూపంలో ఉన్న మనస్సుని పరిష్కారం చేసుకోలేనప్పుడు మీరు ఎన్ని గ్రంథాలు చదివినా మీకు అభివృద్ధి కనపడదు. మేము చాలా నోములు నోస్తున్నాము, వ్రతాలు చేస్తున్నాం, పూజలు చేస్తున్నాం అని మీరు అనుకోవచ్చు. వాటికి కూడా మీ అహంకారం కేంద్రం. అది జ్ఞాపకం ఉంచుకోండి. మనం ఏదో ఒకటి పూజ చేస్తున్నాం మన పూజలు ఈశ్వరుడికి సమర్పిస్తున్నామా? మన అహంకారానికి సమర్పిస్తున్నామా? అహంకారం కోసం పూజ చేస్తున్నామా? లేకపోతే పూజ ఈశ్వరుడికి సమర్పిస్తున్నామా? మీరు ఒక మంచి పని చేస్తున్నారు అది కృష్ణార్పణం అని నోటితోటి అంటారు అనుకోండి, కానీ మీరు అహంకారం కోసం చేస్తున్నారో, కృష్ణుడి కోసం చేస్తున్నారో, ఆత్మరూపంలో ఉన్న కృష్ణుడికి తెలియదా? అహంకారానికి రూపం లేదు కాని అది ఏదో ఒక రూపాన్ని పట్టుకుని అలా ఉంటుంది. మీరు తల్లి గర్భంలోంచి బయటకు వచ్చిన సెకను నుంచి చూసుకోండి. మళ్ళీ స్మశానానికి వెళ్ళేవరకు మీ అహంకారం ఏదో ఒక రూపాన్ని పట్టుకుని ఏడుస్తూ ఉంటుంది. కొంతకాలం అమ్మ రూపాన్ని పట్టుకుంటుంది, కొంతకాలం ఆట వస్తువుల రూపం పట్టుకుంటుంది. కొంతకాలం బడిలో స్నేహితుల రూపం పట్టుకుంటుంది. తరువాత భర్త రూపాన్ని పట్టుకుంటుంది. తరువాత పిల్లల రూపాన్ని పట్టుకుంటుంది. తరువాత మనవలు రూపాన్ని పట్టుకుంటుంది. ఈ మధ్య మధ్యలో పచ్చడి వేసుకున్నట్టు కొంచెం కొంచెం పలుకుబడి, కొంచెం కొంచెం గౌరవాలు ఇవన్నీ అహంకారానికి కావాలి. తరువాత ఎవరిని ప్రేమిస్తారు?


తరువాత ఏ డబ్బు రూపాన్ని ప్రేమించడమో, చదువు రూపాన్ని ప్రేమించడమో, లేకపోతే మీ బంధువులనిప్రేమించడమో, మీకున్న ఐశ్వర్యాన్ని ప్రేమించడమో, ఆఖరికి మరణించేడప్పుడు మీకు తెలివి వచ్చి ఆ రూపాన్ని తొలగించుకోవడానికి ప్రయత్నం చేసినా ఆ రూపం తొలగదు.

మీకు ఏ రూపం అయితే ఇష్టమో, ఏ వస్తువు అయితే ఇష్టమో, ఏ తలంపు అయితే ఇష్టమో, అది మరణించేడప్పుడు సినిమాలో బొమ్మలు వచ్చినట్టు మీ దృష్టిలోకి వస్తాయి. అప్పుడు మీరు పరిష్కారం చెయ్యలేరు. అప్పుడు మీకు టైము లేదు. ఒకవేళ మీరు పరిష్కారం చేద్దాం అనుకుంటే, మీ మనసు ఆత్మ మీద ఉండదు. తలంపు వచ్చి నిలబడుతుంది, బొమ్మ వచ్చి నిలబడుతుంది మీరు మరణించే టైములో, అప్పడు పరిష్కారం చేసుకోవడానికి మీకు కాలం ఉండదు, భగవంతుడు మీకు వ్యవధి ఇవ్వడు. అంటే ఏమిటి? మరణించే వరకు ఏదో ఒకవస్తువుకో, నామ రూపానికో బానిసలుగా ఉన్నాం.

పుట్టినది మొదలు చచ్చే వరకు అహంకారం ఒక నామరూపం మీదే ఉండదు. ఏదో ఒక నామ రూపాన్ని పట్టుకుంటుంది. నామ రూపాలన్ని మారుస్తూ ఉంటుంది. మనం పార్టీలు మార్చినట్టు. కొంతమంది చూడండి పార్టీలు మారుస్తూ ఉంటారు. ఎందుచేతపార్టీలు మారుస్తారు? వాళ్ళ స్వార్థం కోసం, ఆ పార్టీ మంచిదో, చెడ్డదో వీడికి అక్కర్లేదు. వీడి స్వార్థం కోసం, వీడి అవకాశం కోసం పార్టీలు మారుస్తాడు. వీడి స్వార్థం కోసం, వీడి అహంకారం కోసం వీడు ప్రేమించే నామరూపాలు కూడా మారుస్తాడు. నువ్వు స్నేహం చేసే వ్యక్తి మంచివాడో, చెడ్డవాడో నీకు అక్కర్లేదు. వాడికి ఎంత దోషం ఉందో మీకు అక్కర్లేదు కానీ మీ అహంకారానికి వాడు ఉపయోగపడుతుంటే, మీ అహంకారం కోసం వాడిని ప్రేమిస్తారు. అక్కడ కూడా వాడు ముఖ్యం కాదు, మీ అహంకారమే కేంద్రం. పార్టీలు మారుస్తున్నప్పుడు మీ స్వార్థం ఏ విధంగా అయితే కేంద్రమో, నువ్వు ప్రేమించేవస్తువును మార్చినపుడు, నువ్వు ప్రేమించేవ్యక్తిని మార్చినప్పుడు, నువ్వు ప్రేమించే ఆదర్శాన్ని మార్చినపుడునీ అహంకారమే కేంద్రం. అహంకారాన్ని satisfy చెయ్యటం కోసం జన్మించాం. అహంకారం satisfy చెయ్యటం కోసం జీవిస్తున్నాం. అహంకారం సృష్టించిన సమస్యలను పరిష్కారం చేసుకోలేక గింజుకుని చస్తున్నాము. చివరకు అహంకారం యొక్క మూలం దాని వేరు తెగకుండా, మేము ముక్కు చివర పెట్టాం, చెవులు చివర పెట్టాం అంటే సమస్య పరిష్కారం అవ్వదు. దృష్టి ముక్కు చివర పెడితే రెండు నిమిషాలు శాంతిగా ఉంటుంది. అంటే ముక్కు చివర దృష్టి పెట్టుకోవద్దు అని కాదు నేను చెప్పేది. బాగుంటే పెట్టుకోండి, ఏదో రెండు నిమిషాలు, మూడు నిమిషాలు శాంతిగా ఉంటుంది. మనకి ఆదర్శాలు మారచ్చు,

ఆశయాలు మారచ్చు, కాంక్షలుమారచ్చు, ఉద్దేశాలు మారచ్చు, అన్నీ మారుతూ ఉండచ్చు కానీ మార్చేది అహంకారమే. దాని మూలం తెలుసుకునే వరకు దాని జన్మస్థానం తెలుసుకునే వరకు అది పడదు.

రమణ స్వామి ఏమి చెప్పారు అంటే మీ అహంకారం ఎక్కడ పుడుతోందో, దాని జన్మ ఎక్కడ నుంచి వచ్చిందో, దానిని తెలుసుకోవాలి దాని జన్మస్థానం తెలిసేవరకు అది పడదు. అహంకారం యొక్క జన్మస్థానం మీకు అర్థం అయ్యేవరకు అది పడదు. దానికి రూపం లేదు కానీ ఏదో ఒక రూపాన్ని పట్టుకుంటుంది. మనం అన్నం తింటూ ఉంటే మన శరీరం ఏ విధంగా పుష్టిగా ఉంటుందో, అదే విధంగా ఈ అహంకారం కూడా ఏదో ఒక రూపాన్ని పట్టుకుని పెరుగుతూ ఉంటుంది. మీ అహంకారాన్ని మర్చిపోయి, మీ శరీరాన్ని మర్చిపోయి, మీ పుణ్యాన్ని మర్చిపోయి, మీ పాపాన్ని మర్చిపోయి, మీ రాగ ద్వేషాలను మర్చిపోయి, మీ కామ క్రోధాలను మర్చిపోయి, మీ అంగ బలాన్ని, మీ బంధువులని, మీ డబ్బుని, మీ గౌరవాలని అన్నీ మర్చిపోయి మీ జీవితంలో ఎప్పుడైనా ఒక పని చేశారా? ఇంక ఈశ్వరుడి దగ్గరకు వెళ్లి నాకు మోక్షాన్ని ప్రసాదించు తండ్రి అని ఏ మొఖం పెట్టుకొని అడుగుతాము. అలా అడగటానికి మనకి సిగ్గు వెయ్యటం లేదా, నన్ను నేను మర్చిపోయి జీవితంలో ఒక్క మంచి పని చేశానా? ఒకవేళ ఏదైనా మంచి పని చేసినా అహంకారాన్ని, నా శరీరాన్ని దృష్టిలో పెట్టుకుని చేశాను కానీ నన్ను నేను మర్చిపోయి ఎప్పుడైనా ఒక మంచి పని చేశానా? నన్ను నేను మర్చిపోతే కదా ఈశ్వరుడిని స్మరించేది. మీరు అందరూ భగవంతుడిని స్మరిస్తున్నారు. మీరు అందరూ భక్తులే, కానీ భగవంతుడు మిమ్మల్ని ఎప్పుడైనా స్మరించాడా? అయ్యో మనం ఇన్నిసార్లు భగవంతుడిని స్మరిస్తున్నాం, కృష్ణా అంటున్నాం, రామా అంటున్నాం, శివా అంటున్నాం, అరుణాచల శివా అంటున్నాం. మీరు అందరూ భక్తులే కదా, భక్తులు కాకపోతే ఇక్కడకు ఎందుకు వస్తారు? మీరు అందరు భగవంతుడిని పూజిస్తున్నారు కానీ



**దేహంతోటి తాదాత్మ్యం ఉన్నంతకాలం నీకు అహంకారం పోదు. అహంకారం ఉన్నంతకాలం, కర్తృత్వం ఉన్నంతకాలం, మనిషి కూడా నీడ ఎలా వస్తుందో అలా దుఖం నిన్ను వెంటాడుతుంది.**

ఎప్పుడైనా మీకు ఈ ప్రశ్న వచ్చిందా, భగవంతుడు ఎప్పుడైనా నన్ను స్మరించాడా? అని.

నేను సహాయం చేద్దామని ఎంత ప్రయత్నం చేసినా, నా సహాయం ఇసుమంతయు కొంచెం కూడా అవసరం లేకుండా, గోవు లక్ష్మి మోక్షం పొందింది అన్నారు భగవాన్. పళినికి చేశాను, అమ్మకి చేశాను. లక్ష్మికి చెద్దామంటే నేను ఏమీ సహాయం చెయ్యక్కర్లేకుండా దానంతట అదే మోక్షం పొందింది అన్నారు. దానికి కారణం ఏమిటి? ఆకుకూరలవ్వ శరీరం విడిచి పెట్టేసిన తరువాత కూడా ఎవరు అన్నం తెచ్చి పెట్టినా కూడా ఆకుకూరలవ్వ ఇలా తెచ్చేది, ఆకుకూరలవ్వ ఇలా పెట్టేది అనేవారు. మీరు పచ్చడి తెచ్చి భగవాన్‌కి పెట్టారు అనుకోండి, ఎంత ధనవంతులు అక్కడకితీసుకు వచ్చి పెట్టినా, సరిగ్గా అన్నం చూసేటప్పటికి ఆకుకూరలవ్వ జ్ఞాపకం వచ్చేది. అంటే ఒక జీవుడిని భగవంతుడు స్మరిస్తున్నాడు, ఆకుకూరలవ్వ రమణ స్వామిని స్మరించడం కాదు, ఆకుకూరలవ్వని రమణ స్వామి స్మరిస్తున్నాడు. ప్రధాన మంత్రి మీకు ఒకపని చేసి పెడతాడు అనుకోండి, ఆ పని అవ్వకుండా నేను ఆపు చేయగలనా? ఈశ్వరుడు ఇందులో ఎవరికి అయితే ఉపకారం చెయ్యాలి అనుకున్నాడో, ఒకవేళ మీకు ఆ ఉపకారం జరగకుండా నేను ఆపు చేసినా, ప్రపంచం అంతా ఆపు చేసినా, సృష్టి ఆపు చేసినా, దేవతలు అందరూ ఆపు చేసినప్పటికీ అది ఆగదు. భగవంతుడికి అసాధ్యం అంటూ లేదు. ఈశ్వరుడు వచ్చి మీకు ఉపకారం చేస్తూ ఉంటే నా అహంకారం కొద్ది ఆ ఉపకారాన్ని ఆపు చేద్దామని ఎంత ప్రయత్నం చేసినా, గింజుకున్నా, కొట్టుకున్నా, తన్నుకున్నా, ఈశ్వరుడు మీకు ఆ ఉపకారం చెయ్యకుండా నేను ఆపుచేయలేను. మనిషికి అసాధ్యం ఉంది కానీ ఈశ్వరుడికి అసాధ్యం లేదు.

రమణస్వామే ఆకుకూరలవ్వని స్మరిస్తూ ఉంటే ఆకుకూరలవ్వకి మోక్షం రాకుండా మీరు ఆపు చెయ్యగలరా? నేను ఆపు చెయ్యగలనా? ఇక్కడ మీరు గమనించవలసింది ఆకుకూరలవ్వ ఈశ్వరుడిని స్మరించడం కాదు, ఈశ్వరుడే ఆకుకూరలవ్వని స్మరిస్తున్నాడు. దీపావళి రోజున, ఎవరైనా ఇంటికి ఆకుకూరలవ్వ భిక్షకి వెళితే, ఆ ఇంటికాడ జంతికలు వండుకుంటే, ఆ భిక్షతో పాటు జంతిక వేస్తే, ఇది స్వామికి పట్టుకెళ్ళి ఇస్తాను ఈ జంతిక అని తెచ్చేది. పెద్ద పెద్ద ధనవంతులు ఐశ్వర్య వంతులు అందరూ కూడా గంపల కొలది జంతికలు తీసుకొచ్చి భగవాన్ ఎదురుగా పెడితే, అవ్వా జంతిక తెచ్చావా అని ఆ గంపలలో ఉన్న జంతికలకంటే, ముందు ఆకుకూరలవ్వ పట్టుకెళ్ళిన జంతిక తిన్నారు. ఏంటి ఆ జంతిక రుచిగా ఉందా, రుచిగా లేదా అని కాదు. తనకి భిక్ష వేసిన జంతిక. తను తినలేదు, తనకి ఆకలిగా ఉంది, ఆకలిగా ఉంది కాబట్టి అడుక్కుంటుంది. తిండి ఉన్నవారు ఎవరు

అడుక్కుంటారు? ఆకలితో మాడిపోతున్నప్పటికీ తను తినకుండా భగవాన్ కోసం జంతిక తెచ్చేది. అన్నం దొరకనపుడు తెలుస్తుంది ఆకలి కూడా ఏ విధంగా బాధో.

ఆచార్య స్వామి వారు అన్నారు ఆకలి కూడా ఒక రోగం. రోగం వచ్చినప్పుడు మందు ఎంత వేసుకుంటావో, అలాగే ఆకలి అనే రోగానికి కూడా సరిపడా మందు వేసుకోవాలి. మీకు రోగం వస్తుంది అనుకోండి మందు సీసాలు సీసాలు తాగేయరు. రోగానికి సరిపడా మందు తాగుతారు. అదే విధంగా ఆకలి కూడా ఒక రోగమే. ఆ రోగానికితగ్గట్టు తిను. ఇక్కడ ఏమిటి? తాను ఆకలితో ఉన్నప్పుడు కూడా తాను జ్ఞాపకం రాలేదు. జంతిక రమణ స్వామి దగ్గరకి తెచ్చింది. అంత మధురమైన భక్తి, ఆమె హృదయంలో స్థిరంగా ఉన్నప్పుడు రమణ స్వామి ఆకుకూరలవ్వని స్మరించకుండా ఎలా ఉంటారు? ఆకుకూరలవ్వ శరీరం విడిచి పెట్టిన తరువాత రమణ స్వామి స్మరించేవారు. మనం భగవంతుడి దృష్టిలో పడితే, ఎంతసేపు పడుతుంది మనం పవిత్రులం అవ్వడానికి? మీరు చేసే సాధనలు కంటేమీ మనసుని పవిత్రం చెయ్యడానికి, మీమనసుని ఏకాగ్రం చెయ్యడానికి, మీ మనసులో కుదురు తీసుకు రావడానికి, ఒక సత్పురుషుడు యొక్క చూపు, సత్పురుషుడు యొక్క వాక్కు పనిచేస్తాయి. మీరు సాధన చేసుకోండి నేను వద్దు అనటం లేదు. మీరు రోజుల తరబడి కష్టపడి సాధన చేసి సంపాదించుకున్న పవిత్రత కంటే ఒక సహృదయం కలవాడు మీ తోటి మాట్లాడటం వల్ల, మీ వంక ఒకసారి చూడటం వల్ల ఎక్కువ పవిత్రత కలుగుతుంది. ఒక్క సహృదయుడే మీతో మాట్లాడటం వల్ల, మీ వంక చూడటం వల్ల అంత పవిత్రత కలిగితే, ఒక ఋషి చూసినప్పుడు, ఒక జ్ఞాని చూసినప్పుడు, భగవంతుడు మీ వంక చూసినప్పుడు ఎంత పవిత్రులు అవుతారు మీరు.

మీరు ప్రార్థన చేస్తున్నారు కానీ మీ ప్రార్థన తోటి ఎప్పుడైనా భగవంతుడి హృదయాన్ని తాకారా? మనం ప్రార్థన చేసేటప్పుడు కూడా మనమే జ్ఞాపకం వస్తున్నామా? లేకపోతే భగవంతుడు జ్ఞాపకం వస్తున్నాడా? మీరు ప్రార్థన చేస్తున్నారు కదా, ఉదయం ప్రార్థన చేస్తున్నారు, సాయంత్రం ప్రార్థన చేస్తున్నారు. మీ ప్రార్థనలలో మీరే జ్ఞాపకం వస్తున్నారా? మీకు ఈశ్వరుడు జ్ఞాపకం వస్తున్నాడా? మీరే జ్ఞాపకం వస్తున్నారు. మిమ్మల్ని మీరు పవిత్రం చేసుకోవటానికి కొన్ని వేల జన్మలు పట్టచ్చు, లక్షల జన్మలు పట్టచ్చు, కానీ ఈశ్వరుడే మిమ్మల్ని పవిత్రం చెయ్యాలి అనుకున్నప్పుడు కొన్ని గడియలు చాలు. శరీరం రావటం సంసారం, ఈ శరీరం మరణించటం కూడా సంసారమే. మీరు ప్రశాంతంగా జీవించగలిగితే, అహంవృత్తి లేకుండా జీవించగలిగితే, మీ అహంకారం హృదయంలో కూరుకుపోతుంది. పత్తా లేకుండా

పోతుంది. అహంకారం ఇప్పుడు కనిపిస్తోంది. మీకు జ్ఞానం కలిగిన రోజున అది కనపడదు. మనస్సుని నిగ్రహించుకోండి, మనస్సుని నిగ్రహించుకోండి అని మన శాస్త్రాలు చెప్పాయి, మన పెద్దలు చెప్పారు. భగవంతుడు మీరు ఆత్మని చెప్పాడా? మనస్సని చెప్పాడా? మనస్సైతే మీరు నిగ్రహించుకుంటారు రైటే, మీరు మనస్సా? ఆత్మా? అహంకారం అనేది బుడగ. ఆత్మ సముద్రం. బుడగ లేకుండా సముద్రం ఉంటుంది కాని సముద్రం లేకుండా బుడగ ఉండదు. మనం అందరం బుడగలం. దేహాత్మ భావన ఉన్న మనం అందరం కూడా బుడగలం. అన్ని బుడగలకి, ఏ బుడగకి ఆ బుడగ ఒక బుడగపెద్దది ఉండచ్చు, ఒక బుడగ చిన్నది ఉండచ్చు, కానీ అన్ని బుడగలకి సముద్రం ఆధారం. జీవుడు చేసిన కర్మని బట్టి ఒకొక్క జీవుడు ఒకొక్క సంస్కారాన్ని అనుభవిస్తున్నప్పటికీ జీవులు అన్నిటికీ ఆధారం ఆత్మ. బుడగలలో తేడా ఎలా ఉందో అలా జీవులలో తేడా ఉంది. సంస్కారాలలో తేడా ఉండచ్చు మన ఆధారం మటుకు ఆత్మే. ఈ అహంకారమే సమస్య. మీరు పరిష్కారం చేసుకోకుండా, దేవుడు దేవుడు అంటే ఏ దేవుడు మీకు సహాయం చెయ్యలేడు. మీ అహంకారం అనే సమస్యని పరిష్కారం చేసుకోవడానికి త్రికరణశుద్ధిగా మీరు ప్రయత్నం చేస్తుంటే, ఈశ్వర సహాయం మీకు తప్పనిసరిగా వస్తుంది. కానీ ఈ అహంకారం అనే సమస్యని పరిష్కారం చేసుకోకుండా మటుకు ఏదో ఒక దేవుడు మీకు వచ్చి పరిష్కారం చేస్తాడు అనుకుంటే, ఏ దేవుడు మీకు పరిష్కారం చెయ్యడు. ఏ దేవతా మీకు పరిష్కారం చెయ్యదు. మనకి అన్నీ ఉన్నాయి కాని ఎప్పుడైనా పరమేశ్వరుడు గురించి ఆలోచించామా? ఆకు కూరలవ్వ దగ్గర ఏమీ లేవు ఎప్పుడూ పరమేశ్వరుడు గురించి ఆలోచించేది. ఈ వాక్యం మీరు అర్థం చేసుకోండి. మనకి అన్నీ ఉన్నాయి, కానీ పరమేశ్వరుడు గురించి మనం ఆలోచించలేక పోతున్నాం. ఆకు కూరలవ్వకి ఏమీ లేవు కట్టుకోవడానికి ఒక గుడ్డ, ఒక కుండ. ఇంక ఏమీ లేవు. కానీ నిరంతరం ఆమె ధ్యాస పరమేశ్వరుడు మీదే ఉంది. మనకి అన్నీ ఉన్నాయి కానీ పరమేశ్వరుడి మీద ధ్యాస రావడం లేదు.

సోదరమహాశయులారా! మీరు జీవితంలో, భౌతికంగా కానీ, ఇంకొక రంగంలో కానీ ఎన్ని సాధించినప్పటికీ మీకు ఎన్ని achievements ఉన్నప్పటికీ ఈ అహంకారం అనే సమస్యని పరిష్కారం చేసుకోకుండా మనం శరీరాన్ని విడిచి పెడితే, మనం ఏమీ సాధించనట్టు లెక్క, గుండు సున్న మనకి. బండి చక్రం అంత సున్న తోటి సమానం. కొంతసేపు ఒంటరిగా కూర్చోండి, మౌనంగా కూర్చోండి, కాని మీరు ఏమి చేస్తున్నారు ఎప్పుడూ మీరు ఏదో ఒకటి మాట్లాడుతూ ఉండాలి, ఎదుటి వాళ్ళు చెప్పేది వింటూ ఉండాలి. ఇదంతా

అహంకారానికి మేత. మీరు ఐదు నిముషాలు ప్రశాంతంగా కూర్చోమని చెప్పండి వాళ్ళు కూర్చోరు. వీడు పక్కవాడితోటి మాట్లాడుతూ ఉండాలి. పక్కోడు చెప్పే మాటలు వీడు వింటూఉండాలి. ఇదంతా లోపల ఏమిటి? అహంకారం అనే పురుగు మిమ్మల్ని దొలిచేస్తోంది. అది దొలుస్తూ ఉంటుంది అస్తమానూ, మీరేమో ఎదుటి వాళ్లకి చెబుతూ ఉండాలి, ఎదుటి వాళ్ళు చెప్పే మాటలు మీరు వింటూ ఉండాలి. అంటే వాళ్ల అహంకారాన్ని మీరు పోషించడం, మీ అహంకారాన్ని వాళ్ళు పోషించడం.

యదార్థం చెప్పాలంటే మీ హృదయం మీద చెయ్యి పెట్టుకుని ఒక విషయం ఆలోచించండి. మీరు చేసే ప్రతీ పని కూడా ప్రతీ ఆలోచన కూడా ఏ రంగంలో మీరు పని చెయ్యండి. లోకం మెప్పు కోసం మీరు పని చేస్తున్నారా? ఈశ్వరుడి మెప్పు కోసం మీరు పని చేస్తున్నారా? అది మీకు తెలియటం లేదా? లోకం మెప్పు కోసం మీరు పని చేస్తూ ఉంటే లోకంలో మీకు కీర్తి రావచ్చు, లోకంలో మీకు గౌరవాలు రావచ్చు. లోకంలో వచ్చే మీ గౌరవాలని మీరు మూటలు కట్టుకోండి. కానీ మీకు మోక్షం ఇచ్చేది లోకం కాదు, ఈశ్వరుడు. అది గుర్తు పెట్టుకోండి. మీరు మంచి మంచి మాటలు మాట్లాడవచ్చు. మీరు మాటలు మాట్లాడేటప్పడు లోపల ప్రేరణ ఏమిటి? లోపల ఉద్దేశ్యం ఏమిటి? అది ఈశ్వరుడు చూస్తాడు. మీకున్న వాసన సంకల్పం రూపంలో వస్తుంది. మీ వాసన మీకు సంకల్ప రూపంలో వచ్చేవరకు ఆ వాసన ఉన్నది అన్న సంగతి మీకే తెలియదు. కానీ మీకు వాసన సంకల్పంగా రాకముందు కూడా మీలో ఏ వాసన ఉందో ఈశ్వరుడికి తెలుసు. ఈ జీవులు అందరూ పూర్వ జన్మలలోఎవరో నాకు తెలుసు, రాబోయే జన్మలు ఎటువంటి జన్మలో నాకు తెలుసు అన్నాడు పరమేశ్వరుడు.

మీరు మాట్లాడేటప్పడు అందంగా మాట్లాడుతున్నారా? అది కాదు పరమేశ్వరుడు



**మనం స్వార్థం తోటి, కోరికలతోటి పని చెయ్యటం వల్ల మనకి పునర్జన్మలు వస్తాయి.**

**కానీ, లోపల ఉన్నటువంటి సత్యం తానుగా మీకు గోచరించినప్పుడు మీకు పునర్జన్మలతోటి పని లేదు.**

చూసేది మీరు మాట్లాడేటప్పుడు మీ మాటలో లోపల ఉన్న ప్రేరణ ఏమిటి? ఏ ప్రేరణ వల్ల మీరు మాట్లాడుతున్నారు? ఏ ప్రేరణ వల్ల మీకు తలంపు వస్తోంది? లోపల ఏమిటది? అది చూస్తాడు. చాలామంది అంటారు నేను నిష్కామ కర్మ చేస్తున్నాను, కోరికలు లేకుండా పని చేస్తున్నాను అని, వీళ్ళు కోరికలు లేకుండా పని చేయడం నిజం అయితే ఈపాటికి జ్ఞానం రావాలి. సోదరమహాశయులారా, మీకు సరదాగా వినాలనే కోరిక తోటి ఇక్కడకు రావచ్చు. సరదాగా వెళ్ళి సినిమా చూసినట్టే ఆదివారం వెళ్ళి అక్కడ కూర్చుందాము అని రావచ్చు. మీరు ఎలా వచ్చినా మంచిదే. నిప్పు మీద మీకు తెలియకుండా చెయ్యి వేశారు అనుకోండి, పాపం, తెలియక వేశారు అని నిప్పు ఊరుకుంటుందా? కాల్చి విడిచి పెడుతుంది. తెలిసుండి వేసిన వాడిని ఎంత కాలుస్తుందో, తెలియకుండా వేసిన వాడిని అంతే కాలుస్తుంది. దాని స్వభావం అది. మీరు సరదాగా వచ్చినా, interest తోటి వచ్చినా, హేళన చెయ్యడానికి వచ్చినా, లేకపోతే సాధన చెయ్యడానికి వచ్చినా, లేకపోతే వాదన చెయ్యడానికి ఇక్కడకు వచ్చినా, ఎలా వచ్చినా ఎంతోకొంత improvement మీ జీవితంలో కనిపిస్తుంది. మీరు అందరూ కలిపి నన్ను హేళన చెయ్యడానికి వస్తున్నారు అనుకోండి, అలా వచ్చినా మంచిదే నాకు.

మీకు భక్తి ప్రధానమా? లేకపోతే గౌరవాలు ప్రధానమా? భక్తి కోసం ఈ గౌరవం అనే గడప దాటలేమా మనం? మీరు ఊరు ప్రయాణం పెట్టుకున్నారు అనుకోండి మీరు గడపే దాటలేరు అనుకోండి ఇక ఊరికి ఏమి వెళతారు? రామకృష్ణుడు చెప్పిన కథ ఎంత చక్కగా ఉందో చూడండి. ఒకే ఊరిలో పురాణాలు చెప్పే పంతులు గారు ఉండేవారు, ఒక వేశ్య ఉండేది. ఆ వేశ్య చిన్నప్పటి నుంచి దారిద్ర్యం అనుభవించింది. ఆ వృత్తిలో పుట్టింది, ఎంతోమంది ధనవంతులు ఆ వేశ్య ఇంటికి వస్తూ ఉండేవారు. పురాణాలు చెప్పే పంతులు గారు గుళ్ళోకూర్చొని భాగవతం, రామాయణం చెప్పేవారు. పైగా ఇతను పురాణం ఎందుకు చెబుతున్నాడు? డబ్బు కోసం చెబుతున్నాడు. ఇదే మీరు గ్రహించాలి. పురాణాలు బాగానే చెప్పేవారు ఈ పంతులు గారు, కానీ ఇతని ఉద్దేశ్యం ఏమిటి? ఆ వేశ్యకి బోల్డంత డబ్బు వస్తుంది, మీరు బాగా గ్రహించండి. ఆ వేశ్య దగ్గరకు పెద్ద పెద్ద వాళ్ళు, ధనవంతులు వస్తున్నారు. మనకేంటి హారతి పళ్ళెం పెట్టినా రూపాయి రావడం లేదు. పోనీ సాయంత్రం దాకా ఒక గంటసేపు చెప్పి హారతి పళ్ళెం పెడతాడు. హారతి పళ్ళెం పెట్టినా రూపాయి ఇవ్వటం లేదు, రెండు రూపాయలు ఇవ్వటం లేదు. అంటే ఈయన మనసు ఎక్కడకి పోతోంది? వేశ్య మీదకి పోతోంది. నేను పురాణం కష్టపడి చెబుతున్నాను డబ్బు లేదు ఏమీ లేదు. వేశ్య బోల్డంత డబ్బు సంపాదిస్తోంది మెడ నిండా వస్తువులు, ఎంత ఐశ్వర్యం. మేడ కట్టేసింది.

ఏంటి మన బ్రతుకు ఇలా ఉంది అనుకున్నాడు. అంటే ఈయన చెప్పటం నోటి తోటి పురాణం చెబుతున్నాడు, మనస్సులో అస్తమాను వేశ్యని స్మరిస్తున్నాడు. ఆ వేశ్య ఏమనుకుంటోంది? ఏమి దరిద్ర్య జీవితం, ఈ జీవితం నాకు వచ్చింది ఏమిటి? ఆ పంతులు గారు శుభ్రంగా రామా అంటున్నారు, కృష్ణా అంటున్నారు. ఆవిడ మనస్సంతా కూడా పంతులు గారు మీద, ఈశ్వరుడి మీద ఉంది. ఆ వేశ్య యొక్క శరీరం ఇతరులకు ఇచ్చినా, హృదయం మటుకు ఈశ్వరుడికి ఇస్తోంది. గమ్మత్తు చూడండి ఇక్కడ, ఈ పంతులు గారు ఏమి చేస్తున్నారు? నోరేమో పురాణానికి ఇచ్చారు. హృదయం ఎవరికి ఇస్తున్నారు? వేశ్యకి ఇస్తున్నారు. అంటే వేశ్య దగ్గరకి వెళ్లి కూర్చోందాంఅని కాదు. వేశ్యకి వచ్చే డబ్బు మనకి రావడం లేదేమిటా అని, ఈయనకి డబ్బు సమస్య, అది మీరు అర్థం చేసుకోవాల్సింది. నేను కష్టపడి పురాణం చెబుతున్నాను నాకేమి రావడం లేదు. పైగా పెద్ద పెద్ద వాళ్ళు వచ్చి కూర్చోవటం లేదు ఇక్కడ. మాములు వాళ్లే వచ్చి కూర్చోంటున్నారు. ఎంతసేపు పైసా, రెండు పైసలు ఇచ్చేవాళ్లే వచ్చి కూర్చుంటున్నారు. ఆవిడ దగ్గరకు పెద్ద పెద్ద వాళ్ళు వస్తున్నారు ఆవిడకు డబ్బు వస్తోంది అని బాధ పడుతూ ఉండేవాడు. ఆ వేశ్య ఏమనుకునేది? ఏదో పంతులు గారు భగవంతుడిని స్మరించుకుంటున్నారు. మన జన్మాంతరం చెడ్డ కర్మ వల్ల, దుష్ట కర్మ వల్ల భగవంతుడు ఇటువంటి జన్మ నాకు ప్రాప్తించాడు. నాకేదైనా దుష్ట కర్మ ఉంటే దీనిని కత్తిరించేయ్, దీనిని కోసేయ్, అటువంటి పురాణం వినే అదృష్టం నాకు కలుగజెయ్యి పరమేశ్వరుడా అని హృదయంతో నిరంతరం ఈశ్వరుడిని ప్రార్థించింది. పంతులుగారు ఏమి చేశారు? నోటిని ఈశ్వరుడికి ఇచ్చి హృదయంతో ఆ వేశ్యని, వేశ్యకి వచ్చే డబ్బుని, స్మరిస్తూ ఉండేవారు. జాగ్రత్తగా వినండి ఇక్కడ హృదయం ప్రధానం. ఆ వేశ్య, పంతులు గారు ఇద్దరూ ఒకేరోజున మరణించారు. ఆశ్చర్యం అండి ఈ పంతులు గారు కూడా పెద్దలందరూ ఊరేగింపుగా నాలుగు వందల మంది వెళ్లారు అటండి స్మశానానికి. వేశ్య మరణిస్తే మీరు రండి అంటే మీరు రండి అని శవాలు మోసేవాళ్ళు కోసం వెతకవలసి వచ్చింది. ఎలాగైతే నలుగురిని పోగేసి మీకు పది రూపాయలు ముట్ట చెబుతాము అని చెప్పి శవాన్ని స్మశానానికి తీసుకువెళ్లారట. ఆ పంతులు గారిని గౌరవంగా తగలేసేశారు, ఒక సంతాప సభ కూడా పెట్టారు. వేశ్యకి సంతాప సభ ఎవరు పెడతారు? మరి మోసుకు వెళ్లటమే కష్టమయ్యింది కదా, ఈవిడని కూడా ఆ రోజే తీసుకెళ్లారు దహనం చేశారు. రామకృష్ణ పరమహంస చెప్పాడు అండి ఒకే రోజున ఇద్దరూ మరణించారు. వేశ్యకి స్వర్గం వచ్చింది, పంతులు గారికి నరకం వచ్చింది. ఆయన లోకం మెప్పు కోరాడు. లోకం మెప్పు

అయ్యిపోయింది. స్మశానం దాక శవాన్ని ఊరేగించి తీసుకు వెళ్ళారు కానీ వాడు చచ్చిన తరువాత నరకం వచ్చింది. ఆవిడ శరీరంలో దోషం ఉన్నప్పటికీ, నిరంతరం హృదయం ఈశ్వరుడు మీద ఉంది, అందుచేత ఆ శరీరానికి ఊరేగింపు జరగకపోవచ్చు కానీ మరణించిన తరువాత వైకుంఠం వచ్చింది అని చెప్పాడు రామకృష్ణుడు. మనం ఏమి మాట్లాడుతున్నాం? ఏమి తింటున్నాం? అన్నది కాదు మన హృదయంలో ఏముంది అది ముఖ్యం. నిజమైన ఆలయం మన హృదయమే. మన హృదయమే దేవాలయం.

భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నువ్వు ఎంత దురాచారివి అయినప్పటికీ, నువ్వు ఎంత దుష్టుడవు అయినప్పటికీ పరిపూర్ణమైనటువంటి విశ్వాసం నా పట్ల కనుక ఉంటే, నా నామం పట్ల, నా అవతారం పట్ల, నేను చేస్తున్న పనుల పట్ల, పరిపూర్ణమైన విశ్వాసం, చలనం లేని విశ్వాసం కనుక ఉంటే, పూర్ణ విశ్వాసం, పూర్ణ శరణాగతి కనుక నా పట్ల నీకు ఉంటే, నీలోని దుష్కర్మని అంతా కత్తిరించి, నీకు నా స్వరూపాన్ని ఇస్తాను. నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాను అన్నాడు పరమాత్మ. మనకి పరిపూర్ణమైన విశ్వాసం లేదు. మనది చలిస్తున్నటు వంటి విశ్వాసం, మనకి అప్పుడప్పుడు వస్తుంది అమావాస్య రోజున, పౌర్ణమి రోజున, ఏకాదశి రోజున విశ్వాసం వస్తుంది. మళ్ళీ పడిపోతుంది. తుమ్మితే ఊడిపోయే ముక్కు ఎంతసేపు ఉంటుంది? చలించనటువంటి విశ్వాసం అటువంటి విశ్వాసం కనుక నా మీద మీకు ఉంటే మీకు మోక్షం వస్తుంది. నేను ప్రసాదిస్తాను మోక్షం అన్నాడు ఈశ్వరుడు. గురువు యొక్క అనుగ్రహం లేకపోతే, ఈశ్వరుడు యొక్క అనుగ్రహం లేకపోతే ఒక చిన్న వాసనను కూడా బయటకి గెంటలేము. నన్ను నమ్మండి, నన్ను నమ్మండి, నన్ను నమ్మండి.

పెరుమాళ్‌స్వామి భగవాన్‌కి ఎంతో సేవ చేశాడు. కానీ భగవాన్ స్కంధాశ్రమం నుంచి రమణాశ్రమం అమ్మసమాధి దగ్గరకి వచ్చేటప్పుడు పెరుమాళ్‌స్వామి ఒక మాట చెప్పాడు. స్వామి స్కంధాశ్రమం నేను కష్టపడి కట్టాను, కింద అమ్మసమాధి దగ్గర ఏముంది? చెట్టు ఉంది అక్కడ, ఒక తాటాకు పాక వేశారు, మీరు ఆ తాటాకు పాకలో కూర్చుంటున్నారు, మీకు స్కంధాశ్రమం చాలా బాగుంది కదా, అందుచేత అక్కడకు వెళ్ళద్దు అన్నాడు పెరుమాళ్. ఏదో ఈశ్వరశక్తి నన్ను ఇక్కడ కూర్చోబెట్టింది. నా అంతట ప్లాన్ వేసుకుని నేను ఇక్కడకు రాలేదు. విరూపాక్ష గుహ నుండి కూడా నా అంతట నేను స్కంధాశ్రమానికి రాలేదు. స్కంధాశ్రమం విడిచి పెట్టి నా అంతట నేను అమ్మ సమాధి దగ్గర కూర్చోలేదు అన్నారు భగవాన్. పరమేశ్వరుడు తీసుకు వచ్చాడు అక్కడ శరీరాన్ని కూర్చోబెట్టాడు అన్న సంగతి పెరుమాళ్ స్వామికి ఎంత చెప్పినా, ఆయన బుర్రకి ఎక్కించ లేకపోయారు. ఎందుచేత?

ఆయనకు భగవాన్ మీద ద్వేషం ప్రారంభం అయ్యింది. నేను చెబితే వినటం లేదు భగవాన్ అనుకొన్నాడు, చూడండి ఎంత అహంకారమో, అరుణాచలేశ్వరుడి ఉద్దేశ్యం ఏమిటి? భవిష్యత్ లో ఈ ఆశ్రమం చాలా పెద్దది అవుతుంది. స్కంధాశ్రమం దగ్గర పెద్దది అవ్వడానికి అవకాశం లేదు. అందరూ ఆ కొండ ఎక్కడం కష్టం. అయినా అక్కడ ప్లేస్ లేదు ఆశ్రమం పెరగడానికి. అంటే పరమేశ్వరుడు తన ప్లాను ప్రకారం రమణస్వామిని తీసుకువచ్చి అమ్మసమాధి దగ్గర పడేశాడు. స్కంధాశ్రమం విడిచి పెట్టి వెళ్ళద్దు అంటే కిందకి అమ్మ సమాధి దగ్గరకి వెళ్ళి కూర్చొన్నాడు అని పెరుమాళ్‌స్వామి ద్వేషం పెట్టుకున్నాడు, పగ పెట్టుకున్నాడు. పగ పెట్టి చివరకి దుష్ప ప్రచారం చేసి, చెడ్డ మాటలు చెప్పి, చెడ్డ పుస్తకాలు రాసాడు. ఒక్క చిన్న కారణం తోటి తన అహంకారం బయటకి పొర్లిపొర్లి ఎలా వస్తుందో చూడండి పెరుమాళ్ స్వామికి. చెడ్డ పుస్తకాలు రాశాడు, చెడ్డ మాటలు రాశాడు భగవాన్ మీద, కానీ ఎన్నడూ భగవాన్ ఒక పరుష వాక్యం పెరుమాళ్‌ని అనలేదు. పెరుమాళ్ స్వామి గురించి భగవాన్ నోటి వెంట ఒక్క పరుష వాక్యం రాలేదు. వాడు ఋషి. చివరకి భగవాన్ శిరస్సు మీద తన పాదాలు పెట్టినట్టు ఫోటోలు తీయించుకున్నప్పుడు, మొఖం మీద ఉమ్మేసినా కూడా, ఎప్పుడూ కూడా భగవాన్ ఒక్క పరుష వాక్యం పలకలేదు. పెరుమాళ్‌స్వామికి అహంకారం వచ్చి ఈయన్ని మాటలు అన్నాడు కానీ భగవాన్‌కు కొంతకాలం సేవ చేశాడు కదా, ఆ పుణ్యం ఊరికే పోదు కదా, ఆ పుణ్యం ఒక్కసారి హృదయంలోంచి ఆవేదనగా బయటకి వచ్చింది. రాసిన పుస్తకాలు మర్చిపోయి, అన్న మాటలు మర్చిపోయి, చేసిన పనులు మర్చిపోయి, పరుగెత్తుకుని భగవాన్ దగ్గరకి వచ్చి పాదాలు పట్టుకుని ఏడ్చాడు పెరుమాళ్. ముసలితనం వచ్చేసింది అప్పటికి పెరుమాళ్‌కి. నేను అన్న మాటలు వల్ల, నేను చేసిన పనులు వల్ల, నాకు నరకం సిద్ధంగా ఉంది. నరకానికి వెళ్ళిపోతాను ఏమో అని భయం వేస్తోంది స్వామి అన్నాడు. నువ్వు చేసిన పనులు వల్ల నిజంగా నువ్వు నరకానికి వెళ్ళిపోతే, పెరుమాళ్ళు నీకోసం నేను కూడా నరకలోకానికి వస్తాను నిన్ను రక్షించడానికి అన్నారు భగవాన్. వాడు గురువు, సద్గురువు అంటే వాడు.

అయితే నేను అన్న మాటలు మనసులో పెట్టుకోకండి అంటాడు పెరుమాళ్ళు. నా మాటలు మీరు మనసులో పెట్టుకోకండి అంటున్నావు. మనస్సు ఉంటే పెట్టుకుంటాను. నాకు మనస్సు లేదు ఎక్కడ పెట్టుకుంటాను అన్నారు భగవాన్. అందుచేత మన అహంకారం ఎప్పుడు విజృంభిస్తుందో చెప్పలేము. స్కంధాశ్రమం నుండి కింద అమ్మ సమాధి దగ్గరకి వెళ్ళద్దు అంటే భగవాన్ అక్కడకి వచ్చి కూర్చొన్నారు అని ఎంతో కక్ష పెట్టుకుని ఇరవై

సంవత్సరాలు భగవాన్‌ను ద్వేషించాడు పెరుమాళ్‌స్వామి. అయినా ఒక్క మాట కూడా భగవాన్ మీద ప్రభావం చూపలేదు, వాడు జ్ఞాని. ఎవరైనా మనల్ని చిన్న మాట అన్నారు అనుకోండి మనం వెంటనే వేడెక్కి పోతాం. రామకృష్ణ పరమహంస అన్నాడు పెద్ద చెట్లులకి కంచె అక్కర్లేదు అయ్యా, మొక్కలకి కంచె కావాలి అన్నాడు. అలాగే మనకి కూడా సత్పురుషుల సహవాసం అనే కంచెకావాలి. ఆచార్యుల వారు చెప్పినా, భగవాన్ చెప్పినా, వాసుదేవ స్వామి చెప్పినా మన గౌరవం వాళ్లకి అక్కర్లేదు. మన దగ్గర ఆశించి ఏమీ చెప్పరు. మరి ఎందుకు చెప్పారు? కేవలం అనుగ్రహం వల్ల చెప్పారు. ఆచార్యుల వారి మాటలు ఈ రోజుకి కూడా ఇక్కడ చెప్పుకుంటున్నాం అంటే కేవలం మనయందు ప్రేమ వల్ల, మనయందు కరుణ వల్ల, మనయందు అనుగ్రహం వల్ల వాళ్ళు చెప్పారు కాబట్టి, ఏమి ఆశించకుండా కేవలం మనమీద దయ వల్ల చెప్పారు కాబట్టి, ఆ మాటలు ఈ నాటికి కూడా సజీవంగా ఉన్నాయి. ఎదుటి వాడి మీద అహంకారం తోటి ఒక మాట చెప్పాం అనుకోండి. అహంకారం తోటి చెప్పిన మాటల ప్రభావం వాడి మీద ఏమి ఉండదు? సాయంత్రానికి వాడు మర్చిపోతాడు, మనం మర్చిపోతాం. యదార్థం చెప్పాలి అంటే మనం శరీరంతోటి ఉన్నా మరణించినట్టే లెక్క. వాళ్ళు శరీరం విడిచిపెట్టేసినప్పటికీ జీవించి ఉన్నట్టే లెక్క. ఆచార్యులు వారు కానీ, భగవాన్ కానీ నోటి వెంట చిన్న మాట వచ్చింది అంటే అది నూటికి నూరు పాళ్ళు మన యందు ప్రేమ కొలది చెప్పిన మాటలు అవి. మనం వాళ్ళని గౌరవిస్తూ ఉంటాం అని కాదు, వాళ్లకి దండలు వేస్తూ ఉంటాం అని కాదు, కించిత్తు కూడా desire కనపడదు. Desire ఉన్నవాడు ఎప్పుడూ మీకు యదార్థం చెప్పడు. Desire ఉన్నవాడు మిమ్మల్ని బాగుపడమని ఎన్నడూ చెప్పడు. Desireless స్టేట్‌లో ఉన్నవాడు నిజం చెప్పగలడు. Desireless స్టేట్‌లో ఉన్నవాడు మిమ్మల్ని గమ్యానికి తీసుకువెళతాడు. భగవంతుడు అనేక సార్లు చెప్పాడు భగవద్గీతలో నన్ను నమ్మండి అని, మీరు నన్ను ప్రేమించండి, మీరు నన్ను ఎక్కువగా



**నీకు ద్వైతం ఉన్నప్పుడు భయం తప్పదు, అసూయ తప్పదు. నీకు అద్వైతానుభవం కలిగే వరకూ, ఉన్న వస్తువు ఉన్నట్టుగా గోచరించేవరకూ నీకు జన్మలు వస్తూనేవుంటాయి.**

ప్రేమించండి. ఇంకా ఎక్కువగా ప్రేమించండి. నన్ను మర్చిపోకండి, నన్ను జ్ఞాపకం పెట్టుకోండి, నన్ను ప్రేమించండి అని పదే పదే చెప్పాడు. మీరు మరణించేటప్పుడు కూడా నన్ను స్మరిస్తూ మరణించండి. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి మరణించేటప్పుడు మర్చిపోతారు ఏమో, అప్పుడు కూడా నన్ను జ్ఞాపకం ఉంచుకోండి అని పరమాత్మ చెప్పాడు. ఏంటి అండి? మనం ప్రేమించడం వల్ల ఆయనకి కలిసి వచ్చేది ఏమిటి? భగవంతుడు నన్ను ప్రేమించండి అని అడగడం ఏమిటండి? మీరు మరణించేటప్పుడు కూడా నన్ను మర్చిపోకండి అని చెప్పాడు. అయన చెప్పటం ఏమిటండి? మనకి ఇష్టమైతే జ్ఞాపకం ఉంచుకుంటాం. లేకపోతే లేదు. జ్ఞాపకం ఉంచుకోండి మర్చిపోవద్దు. నన్నే స్మరించండి అని అడగటం ఏమిటి? ఎందుకు ఆయనని స్మరించుకోవాలి మనం? పైగా అడగడం దేనికి? అలా పదే పదే అడగడంలో అంతరార్థం ఏమిటి? భగవంతుడిని స్మరించటం వలన అది మిమ్మల్ని పవిత్రుల్ని చేస్తుంది, మిమ్మల్ని శుద్ధి చేస్తుంది, ఎండిపోయిన మీ హృదయాలను తడుపుతుంది, మనిషిని మాధవుడిని చేస్తుంది. అందుకే ఆయనను స్మరించుకోవటం. చేతిలో డబ్బు ఉన్నప్పుడు వస్తువు కొనుక్కోవటం ఎంత తేలికో, మీరు పవిత్రులు అయినప్పుడు మీకు మోక్షం రావడం కూడా అంతే తేలిక. అరచేతిలో ముద్ద ఉంది అనుకోండి నోట్లోకి వెళ్ళడం ఏమైనా కష్టమా? అరచేతిలో ముద్ద రెడీగా ఉంది నోట్లోకి వెళ్ళడానికి ఎంతసేపు పడుతుంది? అదే విధంగా మీరు పవిత్రులు అయితే మోక్షం రావడానికి ఎంతసేపు పడుతుంది? మనలోని అపవిత్రతని తొలగించుకోవడం కోసం ఆయన్ని స్మరించమన్నాడు భగవంతుడు.

సోదరమహాశయులారా! మన మనస్సులో మలం ఉంది, ఈ మలం ఎన్ని జన్మల నుంచి వస్తోందో, గాని మనస్సులో మలం ఉంది. ఈ మనస్సులోని మలం బయటకి పోకుండా జ్ఞానం రాదు. సాధన చెయ్యకపోతే మనస్సులోని మలం ఎలా పోతుంది? శరీరంలో ఉన్న మలం ఎంత తేలికగా బయటకు వస్తుందో అంత తేలికగా మనస్సులో మలం బయటకు పోతుంది అని అనుకోకండి. ఈ జన్మలో కానీ, మరొక జన్మలో కానీ, ఈనాటికైనా, ఏనాటికైనా మనస్సులో ఉన్న మలం బయటకి వస్తేనే కానీ జ్ఞానం కలగడానికి అవకాశం లేనేలేదు. ఈ జన్మలో సాధించలేనప్పుడు, ఈ సంవత్సరం సాధించలేనప్పుడు, మరు సంవత్సరం సాధిస్తాం అని, మరుజన్మలో సాధిస్తాం అని, మరు లోకంలో సాధిస్తాం అని ఎక్కడ ఉంది? నాకు కళ్ళు ఉన్నప్పుడే పని చెయ్యలేనప్పుడు కళ్ళు పోయిన తరువాత పని ఎక్కడ చెయ్యగలను? కాళ్ళు ఉన్నప్పుడే నడవలేనప్పుడు కాళ్ళు పోయిన తరువాత ఎక్కడ నడవగలను? తినడానికి భగవంతుడు తిండి ఇచ్చినప్పుడు, తగిన ఆరోగ్యం

ఇచ్చినప్పుడు, తగిన అవకాశాలు ఇచ్చినప్పుడు నేను సాధన చెయ్యకపోతే తరువాత ఏ అవకాశాలు లేనప్పుడు సాధన ఎలా చెయ్యగలను? ఒక్కటే మీరు గుర్తు పెట్టుకోండి. ఈ రోజున మొదటి మాట, చివరి మాట ఇదే. ఎవరికైనా సరే, మనిషికంటే ఒక జంతువుకి మనస్సులో ఉన్న మలం పోతే మనిషికంటే జంతువుకే ముందు మోక్షం వస్తుంది. అది పైకి కుక్క తోలు. ఇది మనిషి తోలు అయ్యి ఉండచ్చు. మనిషికి కుక్కకి తోలు తేడా. రాగ ద్వేషాలు కుక్కకి ఉంటాయి. రాగ ద్వేషాలు మనిషికి ఉంటాయి. కామ క్రోధాలు కుక్కకి ఉంటాయి, కామ క్రోధాలు మనిషికి ఉంటాయి. కానీ పైకి అది కుక్క అంటున్నాం, వీడిని మనిషి అంటున్నాం. ఏమిటి తోలు తేడా, అయితే ఈ మనిషి శరీరంలో ఉన్న జీవుడు కంటే, ఆ కుక్క శరీరంలో ఉన్న జీవుడికి రాగ ద్వేషాలు పడిపోతే ఆ కుక్కకి మోక్షం వస్తుంది. అప్పుడు మనం గొప్పా అక్కడ కుక్క గొప్పా?

ఒకరోజున భగవాన్ ఏదో పరాకుగా ఉన్నారు అప్పుడు భగవాన్‌ని ఏమని అడిగాడు అంటే ఏవండీ ఒకసారి మనిషి జన్మ వచ్చిన వారికి మళ్ళీ పశువు జన్మ వస్తుందా అన్నాడు. భగవాన్ ఇటువంటి వాటికి సమాధానం చెప్పరు. ఆయనకు మంచి చెడ్డ ఏమీ లేదు. అంతా ఆత్మే. మాములుగా ఉంటే చెప్పరు కొంచెం పరాకుగా ఉండి అన్నారు లక్ష్మి మాట ఏమిటి, లక్ష్మి ఎవరు? కీరపాటి ఆకుకూరలవ్వ అన్నారు. ఆ కీరపాటి ఎంత పవిత్రురాలు అయ్యింది అంటే ఏదో చిన్న దోషం ఉండి లక్ష్మిగా (ఆవుగా) జన్మించింది కానీ, చివరకి ఎంత పవిత్రంగా ఉంది అంటే ఆవులో అణుమాత్రం కూడా వాసన లేదు. చాలామంది హాలులో కూర్చొన్నారు. ఆ రోజున ప్రాణం పోతుంది లక్ష్మిది. అమ్మా లక్ష్మి వెళ్ళిపోతావా, అమ్మా లక్ష్మి వెళ్ళిపోతావా అని వెళ్ళి ఆవు యొక్క తలని తొడ మీద పెట్టుకుని, తల మీద చేతితో నిమురుతూ ఉంటే, లోపల సంస్కారాలు ఏవి కనపడటం లేదట. అణుమాత్రం కనపడలేదు ఎంత పవిత్రురాలో గోవు లక్ష్మి చూడండి.

తన తల్లి విషయంలో అరగంట ఉన్నాక వాసనలు ఆగిపోయాయి అనేటప్పటికి ఇంకొక పది నిమిషాలకి ఇంకొక వాసన వచ్చేసింది. ఎటువంటి వాసనలు ఆవిడ హృదయంలో గూడు కట్టుకు పోయాయి అంటే ఒకసారి భగవాన్ కి ఎవరో బ్రాహ్మణులు కాని వారు జంతికలు తెచ్చారు. ఎక్కువ జంతికలు తెచ్చారు. భగవాన్ ఒక జంతిక తింటూ అమ్మా నువ్వు కూడా తిను అని చెప్పారు. నువ్వు తింటున్నావు కదా శూద్ర భోజనం నేను కూడా తినాలా శూద్ర భోజనం? అంటే ఏమిటి ఆవిడకి ఆచారం, అంటే నువ్వు పాడయ్యావు కదా, నన్ను కూడా పాడవ్వమనా? అప్పుడు భగవాన్ అన్నారు. సమత్వదృష్టి వైపు నీ మనసుని

కనుక తిప్పలేకపోతే, ఇంటికి దయచేయడం మంచిది అన్నారు. అటువంటి ఆవిడకి ఎన్ని వాసనలు ఉంటాయి. ఉండకపోతేఏమి చేస్తాయి? మరి కీరపాటికి ఉన్న శరణు ఆవిడకి ఎక్కడ ఉంది? శరీరం ఊరికే తల్లి కడుపు లోంచి వచ్చింది కానీ, భగవాన్ తల్లికి భగవాన్ మీద ఉన్న ప్రేమ కంటే కీరపాటికి ఎక్కువ.

ఒక రోజున ఎప్పుడైనా ఆకుకూరలవ్వకి భిక్ష దొరకకపోతే తన ఆకలి కంటే భగవాన్ ఆకలి గుర్తొచ్చేది అట. భగవాన్ అనేవారు ఎప్పుడైనా ఇవాళ బెంచీలు వచ్చాయి, సోఫాలు వచ్చాయి. మీరందరూ వచ్చారు. ఆ రోజున కొండ మీద నేను ఎండకి ఎండిపోయినప్పుడు, వర్షానికి తడిసిపోయినప్పుడు, చలికి వణికిపోయినప్పుడు ఆ ఎండలో, వానలో, చలిలో ఆ రాళ్ళ మధ్య పడి ఉన్నప్పుడు ఎవరు పెట్టారు నాకు? ఒక్క కీరపాటి అనేవారట. కీరపాటికి ఏమైనా చదువు వచ్చునా? కీరపాటికి ఏమైనా కీర్తి ఉందా? కీరపాటికి ఏమైనా డబ్బు ఉందా? భగవాన్ మీద ఉన్న ప్రేమ చాలు. భగవాన్ పట్ల కీరపాటికి ఉన్న ప్రేమే కీరపాటికి ఉన్న ఐశ్వర్యం. అదే తపస్సు కీరపాటికి. అదే యోగం, అదే కర్మ. కొంతమంది భక్తులు ఏమి చేసేవారంటే కీరపాటి అన్నం తెచ్చి అక్కడ పెడితే, భగవాన్ విస్తరిలో కీరపాటి తెచ్చిన అన్నం పెడితే మనకి పుణ్యం వస్తుంది అని కీరపాటి తెచ్చిన అన్నం గుప్పడు తీసుకుని భగవాన్ విస్తరిలో పెట్టేవారట. అప్పుడు భగవాన్ అనేవారట వాళ్లకి అర్థం అవ్వటం కోసం ఇది కీరపాటి అన్నమే కదా అని, చెయ్యి నీది కాని అన్నం కీరపాటిదే!

**ఓం శాంతిః శాంతిః శాంతిః**


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశ అర్జున తిష్ఠతి ।**

**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥ 18-61 ॥**

**తాత్పర్యము :** అర్జున! శరీరరూప యంత్రములను అధిరోహించిన సర్వప్రాణుల హృదయముల యందు అంతర్యామిగా నున్న పరమేశ్వరుడు తన మాయ చేత వారి వారి కర్మలను అనుసరించి వారిని భ్రమింపజేయుచున్నాడు.

ఈశ్వరః - ఈశ్వరుడు అంటే కేవలం శివుడు అని కాదు. ఈశ్వరుడు అంటే ప్రభువు, యజమాని, ఈశ్వరుడు అంటే కర్త, నియంత. అంటే మనందరికీ శరీరాలు ఉన్నాయి కదా, ఈ శరీరాలని వాళ్ళయొక్క కర్మానుసారం నడిపేవాడు ఈశ్వరుడు. ఈశ్వరుడిని కాదని మనం ఏమీ చేసేది లేదు.

ఈశ్వరః సర్వభూతానామ్ - పరమేశ్వరుడు నారాయణుడు మొత్తం జీవకోటి అందరి హృదయాలలో సమానంగా ఉన్నాడు, హెచ్చుతగ్గులుగా లేడు. మీ మనస్సు హెచ్చుతగ్గులుగా ఉంటుంది కానీ చైతన్యం హెచ్చుతగ్గులుగా ఉండదు.

హృద్దేశ అర్జున తిష్ఠతి - నేను అంతర్యామిగా అందరి హృదయాలలో తిష్ఠ వేసుకొని కూర్చున్నాను. మిమ్మల్ని పరిపాలించేవాడిని నేనే. మీ ప్రభువుని నేను. ఆ దేహంయొక్క ప్రారబ్ధాన్ని అనుసరించి యంత్రాన్ని తిప్పేటప్పుడు బొమ్మలు ఎలా తిరుగుతాయో, మీ

అంతర్యామిగా ఉండి మీ దేహాన్ని నేనే తిప్పుతున్నాను. లోపల అంతర్యామిగా (inner ruler) ఉండి ఆయన చేసే పని అది.

భ్రామయన్ సర్వభూతాని రూఢాని మాయయా - యంత్రానికి కట్టేసిన బొమ్మలు, యంత్రం తిరుగుతూవుంటే ఆ బొమ్మలు ఎలా తిరుగుతాయో, మిమ్మల్ని అందరినీ కూడా మాయలో ఉంచి మీ కర్మలను అనుసరించి ఆడిస్తున్నాను. అసలు మనస్సే మాయ, మనస్సు లేకపోతే మాయ ఎక్కడ ఉంది. అంటే మీకు మనస్సు ఉన్నప్పుడు మాయ ఉంటుంది, వేరుబుద్ధి ఉన్నప్పుడు మాయ ఉంటుంది.

రమణమహర్షిగారిని మాయ అంటే ఏమిటి అని అడిగారు. మాయ అనే శబ్దానికి శాస్త్రంలో అర్థం ఏమిటంటే, ఏది లేదో దానిని మాయ అంటారు. భగవాన్ ఎలా చెప్పారు అంటే, మాయ అంటే బయట లేదు, నీ దురాలోచనలు, నీ స్వార్థము, నీ అలవాట్లు, నీ వాసనలు, నీ సంస్కారాలు అవే మాయ. అందులోంచి విడుదల పొందితే అసలు నీకు మాయ అనేది కనబడదు అన్నారు. అది లేదు కదా అసలు! ప్రతి మనిషికి వాడి దేహబుద్ధి వాడికి మాయ. తాను కానిది తాను అనుకుంటాడు. ఎటాచ్మెంటే (attachment) మాయ అన్నారు.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశ అర్జున తిష్టతి - నీ హృదయములోనే ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు. ఇక్కడ భగవంతుడు ఆయన అడ్రెస్ కరెక్ట్ గా ఇస్తున్నాడు. మనం ఎక్కడో అరుణాచలంలో ఉన్నాడు దేవుడు, కాశీలో ఉన్నాడు రామేశ్వరంలో ఉన్నాడు బదరీనాథ్‌లో ఉన్నాడు అని ఇలా తిరుగుతూ ఉంటాం. మనం ఉత్తరం మీద అడ్రెస్ కరెక్టుగా రాస్తే వెళ్లిపోతుంది; రాంగ్ అడ్రెసుకి రాస్తే ఉత్తరం వెళ్లదు. ఇక్కడ భగవంతుడు నేను కాశీలో ఉన్నాను రామేశ్వరంలో ఉన్నాను అని చెప్పటం లేదు. మీ అందరి హృదయాలలో అంతర్యామిగా తిష్ట వేసుకొని ఉన్నాను అని చెపుతున్నాడు. మీరు స్వతంత్రులు కాదు. మీ హృదయములో ఉండి మిమ్మల్ని పరిపాలించేవాడిని నేనే. అంటే దేవుడు మీఅందరి హృదయములో అంతర్యామిగా ఉన్నానని ఆయన అడ్రెస్ కరెక్టుగానే చెప్పాడు. కానీ మనం ప్రపంచములో వెదుకుతున్నాము; మనదే పొరపాటు అది.


భగవంతుడు ఎక్కడ ఉన్నాడో మనం అక్కడ వెదకటం మానేసి ఎక్కడ లేడో అక్కడ

వెదుకుతున్నాము. అంటే మనకి బయట వెదకటం, బాహ్యచూపు అలవాటు అయిపోయింది. మన ఇంద్రియాలు మనస్సు అంతర్ముఖంగా ఉండవు, బాహ్యముఖంగా ఉంటాయి. హృదయంలో ఈశ్వరుడు నేను ఉన్నానని చెప్పినా, మనం అది చదివినా, మన మనస్సు ఇంద్రియాలు ఆత్మాభిముఖంగా హృదయాభిముఖంగా నడిస్తేనే గాని, అంతర్ముఖం అయితే గాని అది మనకు అర్థం కాదు.

ఈశ్వరుడిని తెలుసుకోవాలంటే, ఆయన అనుగ్రహం లేకుండా మనం ఎన్ని సత్కర్మలు చేసినా ఆయన తెలియబడడు. మనం ఏదైనా సత్కర్మలు చేసినంతమాత్రం చేత మనకు ఆత్మజ్ఞానం రాదు. కొంతమంది ఈ మంచి పని చేస్తే మనకి గౌరవం వస్తుందంటే చేస్తారు. అప్పుడు నీకు గౌరవం వస్తుంది అంతేకాని దేవుడి దయ రాదు. అంటే నువ్వు పని చేసేటప్పుడు నీ మనస్సులో ఏముందో ఏ ప్రేరణ వల్ల నువ్వు చేస్తున్నావో దానినిబట్టి భగవంతుడు నీకు మార్కులు వేస్తాడు. నువ్వు ఎందుకు చేస్తున్నావో లోకానికి తెలియదు కానీ లోపల ఉన్న అంతర్యామికి తెలుస్తుంది. మనం ప్రపంచాన్ని మభ్యపెట్టవచ్చు. కానీ లోపల అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మభ్యపెట్టలేము.

ప్రపంచంలో ఉన్న జీవకోటినంతటినీ వాళ్ళయొక్క ప్రారబ్ధాన్ని అనుసరించి భగవంతుడు ఆడిస్తున్నాడు. మీకేదైనా ప్రారబ్ధం ఉంటే అది సహనముతో అనుభవిస్తే పోతుంది. ఆ దేహం ఉన్నప్పుడు ఏదో ప్రారబ్ధం ఉంటుంది. ప్రారబ్ధం లేకపోతే దేహం రాదుకదా. అందుచేత మీరు మంచి ప్రారబ్ధం ఉంటే పొంగిపోకూడదు. చెడ్డ ప్రారబ్ధము ఉంటే క్రుంగిపోకూడదు ఎందుచేతనంటే అవి నిత్యము కాదు సత్యము కాదు.

భగవాన్ చెప్పిన కీలకం - స్వర్గలోకం నరకలోకం, ఇవన్నీ వ్యవహారిక సత్యాలే. మీకు వ్యక్తీభావన ఉన్నప్పుడు, కామక్రోధాల ప్రకోపానికి నువ్వు స్వాధీనమైనప్పుడు నీకు స్వర్గం నరకం ఉన్నమాట నిజమే. నీకు కామక్రోధాలు లేనప్పుడు లోభిత్వం లేనప్పుడు దేహము నేను అనే బుద్ధి లేనప్పుడు, స్వర్గానికి వెళ్ళేవాడు ఎవడు నరకానికి వెళ్ళేవాడు ఎవడు. నీ అలవాట్లే, నీ ప్రవర్తనే ఈ స్వర్గలోకాలు నరకలోకాలు కల్పిస్తున్నాయి. స్వర్గానికి తీసుకెళ్లినా నరకానికి తీసుకెళ్లినా నీ గుణాలే. నీ మనస్సు ఎంత నిజమో ఆ స్వర్గం నరకం కూడా అంతే నిజం. అందుచేత నువ్వు గుణరహిత స్థితి పొందు అర్జునా, అని ఇక్కడ చెపుతున్నాడు.




**కోపరహిత గుణ గురిగాగ ననుగొను**

**కొఱయేమి చేసితి నరుణాచాలా। 25।**

**తాత్పర్యము :** నాకు తెలిసి నేను నీకు ఏ లోటు చేయలేదే? ఒకవేళ తెలియక నేను ఏదైనా లోటు చేసినప్పటికీ, నీవు అసలు కోపమనే గుణమే లేనివాడివి కదా! కనుక నాలో ఏదైనా లోపమున్నప్పటికీ కోపగించుకోక నన్నే లక్ష్యంగా పెట్టుకొని కాపాడు అరుణాచలా!

"కోపరహిత గుణ " అని నీకు పేరు ఉంది. నీకు అపచారం కలిగించే పనులు నేను చెయ్యొచ్చు, నీ ఆగ్రహానికి గురి అయ్యే పనులు కూడా నేను చెయ్యొచ్చు. కోపం లేని వాడివి, క్రోధరహితుడవు అని నీకు లోకంలో ప్రసిద్ది ఉంది. అందుచేత నేను ఒకవేళ నీపట్ల అపచారం చేసినప్పటికీ, నా ప్రవర్తనలో పొరపాట్లు ఉన్నప్పటికీ, నీకు కోపం అనేది ఏమీ లేదు కాబట్టి, నువ్వు నన్ను తీర్చిదిద్ది అనుగ్రహించు అరుణాచలా.

నా మనస్సుని వికసించేలా చెయ్యి అరుణాచలేశ్వరుడా. అంటే మనందరికీ మనస్సు ఇరుకుగా ఉంటుంది. ఇంకో మాటలో చెప్పాలంటే మురికి గుంటలలాగ ఉంటాయి మన మనస్సులు. కొంతమంది మనస్సులు శుభ్రంగా పాడైపోయి ఉంటాయి. ఆ స్థితికి నన్ను తీసుకురాకు అరుణాచలేశ్వరుడా. నేను శుభ్రంగా పాడవకముందే నీ కరుణ నా యందు చూపించి, నీ జ్ఞానం తోటి అనుగ్రహించు అరుణాచలేశ్వరుడా!

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# స్వీయ సంస్కరణ

సాధారణంగా మనము ఇతరులను మార్చాలి, ప్రపంచాన్ని మార్చాలి అని భావిస్తాం! కానీ మనను మనము మార్చుకునే ప్రయత్నం చేయము. అలాగే ఇతరుల విషయంలో ఇది మంచి, అది చెడు అని తీర్పులు చెబుతూ ఉంటాం! మనము చేసే పనులు, ఇతరుల పట్ల మన ప్రవర్తన ఎలా ఉన్నది అనే విషయాన్ని పట్టించుకోము. అట్టి వివేచన మనకు ఉండదు. మన తలంపు, మాట, చేతల మధ్య పొంతన లేకపోవడాన్ని మనము గ్రహించం. మనము చెప్పిన విషయాలను మనమే ఆచరించం. మన పొరపాట్లను అంగీకరించకుండా, వాటిని యుక్తితో సమర్థించుకునే ప్రయత్నం చేస్తాం! కానీ ఆధ్యాత్మికంగా మనము ఎదగాలంటే మన ప్రవర్తనను, మన వ్యవహారశైలిని బేరీజు వేసుకోవాలి. ఇతరులు చేసే తప్పుల గురించి మనము ఎలా ఆలోచిస్తామో, అలాగే ఇతరులు మన పొరపాట్లు గురించి ఆలోచిస్తారు, తగిన నిర్ధారణకు వస్తారు. కాబట్టి మనలోని దోషాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకోవడం మన వివేకానికి గుర్తు. మన ద్వారా జరిగే పొరపాట్లను సరిదిద్దుకొని, మరల అవి జరగకుండా జాగ్రత్తపడి, అవసరమైతే క్షమాపణ కోరుకోవాలి. మన మాటలు, చేతల ద్వారా ఇతరులను నొప్పించకూడదు. మన ప్రయత్నం, కృషి లేకుండా జీవితంలో హఠాత్తుగా ఎలాంటి అద్భుతాలు జరుగవు. పగ, ప్రతీకారం, ఈర్ష్య, కక్ష, అసూయ, ద్వేషం ఇవే మనకు నిజమైన శత్రువులు. మలినమైన చిత్తముతో పరమాత్మకు భావన చేయడమే పొరపాటు. శుద్ధ వస్తువును, శుద్ధముగా దర్శించాలనుకునే వారు ముందుగా మనస్సును శుద్ధము చేసుకోవాలి. చైతన్యం స్వతహాగా శుద్ధమైనప్పటికీ, చిత్తము మలినంగా ఉంటే అది మలినంగానే కనిపిస్తుంది. మనస్సుది యాచక స్వభావం, కానీ మనకు కావలసింది నిత్య తృప్తి. తృప్తి ఉంటే మనము సదా విందు భోజనాన్ని ఆరగిస్తున్నట్లే. మహాత్ముల జీవితాలు, వారి గుణాలు, వారి బోధ మనలను ఎంతో ప్రభావితం చేస్తాయి. కాబట్టి మనము విచక్షణను ఉపయోగించుకోవడం ద్వారా మానవులైన మనము మాధవునిగా మారతాము. లక్ష్యం తెలుసుండి కూడా దానిని చేరుకునే ప్రయత్నం సలపకపోవడమే మహా తప్పిదం. అహంకారం లేకుండా పనులు చేస్తే చిత్తమాలిన్యం అంటదు. చిత్తశుద్ధికి సాధనం సత్కర్మ, సత్ప్రవర్తన.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# మనలో మకాం వేసిన రాగద్వేషాలను అవతలకు పారద్రోలాలి

మనలో తిష్ట వేసిన రాగద్వేషాలు అనేవి పరాయి వాళ్ళు. వాటిని ఏ మొహమాటం లేకుండా అవతలకు తరిమికొట్టాలి. ఆ శత్రువులు సత్యపదానికి అడ్డుగా నిలుస్తాయి. వాటిని నిశ్శేషంగా విసర్జించాలి. శత్రుశేషం, ఋణశేషం ఉంచుకోకూడదు. ఉంచుకుంటే పెనుభూతాల్లా తారసపడతారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే అవి మనలను కాల్చివేస్తాయి. జాగ్రత్తగా ఉండాలి. ఖాళీ అయిపోయిన మన అంతరంగంలో దేవుడు వచ్చి స్థిరంగా తిష్ట వేస్తాడు. అప్పుడు మనకు శాంతే శాంతి, సుఖమే సుఖం అంటారు పెద్దలు. మనం మా బంధువు అని, ఆత్మీయులని, శత్రువులని విభజించుకుంటూ పరిమితమైన అనుభవాన్ని అనుభవిస్తూ జీవితాన్ని రాగద్వేషాలతో కొనసాగించుకుంటున్నాము. ఎంతో ప్రేమగా పెంచుకున్న శరీరాన్ని ప్రేమతో, కష్టంతో, శ్రమతో సంపాదించుకున్న ఆస్థిపాస్తులను విడిచిపెట్టి వెళ్ళిపోతాము. అసలు విషయమైన సత్యపదార్థాన్ని విడిచిపెట్టి ఏది అవసరమో గుర్తించక ప్రకృతి కార్యకలాపాల్లోనే మునిగిపోతున్నాము. మన జీవితం అంతా భక్తుడిగానే జీవించినా మరణం ఆసన్నమయ్యే సమయంలో ఏవో క్షుద్రమైన కోరికలు తిరుగుబాటు చేస్తాయి. ఏవో వాంఛలు, చింతలు ముసురుకొంటాయి. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు మన దేశంలో వివిధ ప్రాంతాల్లో కానీ, విదేశాల్లో ఉద్యోగాలు చేసే మన సంతానంలో కోడలు అకాలమరణం వల్లకానీ లేదా కొడుకు అకాల మరణం వల్లకానీ కొడుకుకి తిరిగి పెళ్ళి చేయాలా, కోడలు జీవితం మోడు వారిపోయింది. వాళ్ళ పిల్లలు ఏమైపోతారు? మన ఇంటికి తీసుకొని వద్దామంటే విదేశీ వాతావరణం లేదా నగరం వదిలి వాళ్ళు వస్తారా? పిల్లల భవిష్యత్తు ఏమైపోతుంది? వాళ్ళ సంగతి ఏమిటి? వాళ్ళ బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే వేదనతో పుణ్యకాలం అంతా సరిపోతుంది. ఎంతో సాధనానుభవం ఉన్న కొద్దిమంది ఈశ్వర నిర్ణయం ఎలా జరగాలో అలా జరుగుతుందని సమాధానపడతారు. సద్గురువుచేత ఒక్కొక్కసారి ఇలా పరీక్షించబడితే మనకు ప్రాణం పోయేటంతటి బాధ కలుగుతుంది. అది చాలా తీవ్రమైనప్పటికీ మనం వ్యాకులపడకుండా, నిరాశచెందకుండా మంచి రోజులు ముందు ఉంటాయి. ఈ కష్టాల అనంతరం మన గురువు దయవల్ల ప్రశాంత సుఖం మనకోసం వేచి ఉంటుంది. తీవ్రమైన వేసవికాలం ఎండ అనంతరం, వానరాకడను సూచిస్తుంది. ఈ తీవ్రబాధలు, వ్యధలు రాబోయే ఆనందానికి సూచనలు అనుకోవాలి. మన శక్తికి మించిన ఏ విషయం తారసపడినా మన గురువు మనకు వాటిని తొలగించుకొనే సామర్థ్యాన్ని ఇస్తారు అని భావించాలి. రాగద్వేషాలు సాధకులమైన మనలను పీడిస్తాయి. శ్రీనాన్నగారు "ఆ పీడలను, వ్యధలను వాటి మెడబట్టి బయటకి గెంటు. ఇందులో నా సహాయం ఉంటుంది" అంటారు. నిజంగా మనకు ఆ శక్తి లేదు వారి దయ మనకు శ్రీరామరక్ష. మనం చెయ్యవలసినది మన గురువులు పాదపద్మాలపై దృష్టినిలపటమే, వాటిని కళ్ళకద్దుకోవటమే. అది చాలు, అదే ఉన్నతమైనది. కబీర్ "మీ సద్గురువు సాన్నిధ్యంలో ఒక్క క్షణం ఉంటే మీలోని లక్షలాది పాపాలు, సంస్కారాలు క్షణకాలంలో అన్నీ చెల్లాచెదురైపోతాయి" అన్నారు. దాన్ని అనుసరిస్తే అమృతస్థితిని పొందుతాము. అంతే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966**